క్లుప్తంగా

కాకాణి పరామర్శ



మనుబోలు: నెడ్‌క్యాప్ డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దాసరి భాస్కర్‌గౌడ్‌ను మనుబోలులోని ఆయన నివాసంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. భాస్కర్‌గౌడ్ ఇటీవల మెట్లపై నడుస్తూ పడి గాయపడ్డాడు. దీంతో మంత్రి కాకాణి ఆయన్ను పరామర్శించి త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి, నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీంధర్‌రెడ్డి, శానంపూడి సురేందర్‌రెడ్డి, ఉన్నం లక్ష్మీనారాయణ, చల్లా నవకోటి, మహేంద్రవర్మ, దయాకర్, కేవీఆర్ గౌడ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీ, ఎస్ఈలకు వినతి



జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఎనర్జీ అసిస్టెంట్, సెక్రటరీలను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్‌లకు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కన్వీనర్ సాయివిశ్వనాథ్ మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్లు, సెక్రటరీలకు సచివాలయ ఉద్యోగులకు అందిస్తున్న విధంగా ట్రెజరీల ద్వారా వేతనాలు అందజేయాలని, సీఎల్, ఈఎల్, మెడికల్ సెలవులను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శరత్‌కుమార్, నిరంజన్, పెంచలయ్య, కుమార్, హమీద్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ వద్ద ధర్నా



విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్‌భవన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగానే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నేతలు సుమన్, ప్రసాద్, ఆరీఫ్, శ్రీనివాసులు, రాజమోహన్, మహేష్, మనోజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

‘స్పందన’ ఫిర్యాదులపై దృష్టి

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు) : స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు రీఓపెన్ అయితే సంబంధిత విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరం ఎదుట ఉన్న హాల్లో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలని సూచించారు. విభాగాల వారీగా ‘జగనన్నకు చెబుదాం’ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం సంబంధిత వ్యక్తికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ను ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేస్తామన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని చెప్పారు. నగర వ్యాప్తంగా నూతన రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, పార్కుల నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణతో పాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వేగంగా సమస్యల పరిష్కారం

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: గ్రామాల్లోని సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని విలుకానుపల్లి పంచాయతీలో మహాలక్ష్మి అమ్మవారు, వినాయకుని ఆలయాల భూమి పూజా కార్యక్రమంలో మంత్రి కాకాణి సోమవారం పాల్గొన్నారు. అనంతరం అదే గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన కాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసం మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాల్లో ప్రజలు కోరుకున్న విధంగా అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, తాగునీరు, సాగునీరు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ఈదూరు రామాచార్యులు, మద్దెన గోపాల్‌నాయుడు, మండల ఉపాధ్యక్షులు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, కంజి నీలమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిల్లకూరు ప్రసూనమ్మ, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, కావల్‌రెడ్డి రంగారెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్, మాచిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు గంగాధరరెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, శివయ్యానాయుడు, ప్రసన్నకుమార్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



వినాయకుడి ఆలయ భూమిపూజలో పాల్గొన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తుఫాన్ బాధితులకు సాయం



పొదలకూరు: నగదు అందజేస్తున్న దృశ్యం



కొడవలూరు: నిత్యావసరాలు అందజేస్తున్న ఎంపీడీఓ



కోవూరు మండలంలో..

పొదలకూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్న బాధితులకు సోమవారం స్థానిక కాకాణి నగర్, టైలర్స్ కాలనీల్లో ఒక్కో ఇంటికి రూ.4 వేల నగదును అందజేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు తక్షణ సాయం కింద బాధితులకు నగదును అందజేస్తున్నట్లు పొదలకూరు బిట్-1 సచివాలయ కన్వీనర్ ఎస్‌కే అంజాద్ వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో విపత్తులు వచ్చినప్పుడు పరిహారం పొందాలంటే బాధితులు వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీలైనంత త్వరగా పరిహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో నాగమ్మ, వలంటీర్ షబ్నా తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాలు

కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెం మజరా నీలగిరి సంఘంలో తుఫాన్ బాధితులకు ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. వీటిని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందజేశారు. అయన మాట్లాడుతూ బాధితులను ఏఆర్డీ సంస్థ ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు బషీర్, కో-ఆర్డినేటర్ పావని, మండల రీసోర్స్ కోఆర్డినేటర్ వేమారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంకమరాణి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో..

కోవూరు: మండలంలోని చుండుగుంట, వేగూరు గ్రామాలకు చెందిన పలువురు తుఫాన్ బాధితులకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కోవూరు డీఎం రమేష్‌రెడ్డి, ఆర్ఎం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



హెల్త్‌కార్డులను అందజేస్తున్న డాక్టర్ కావ్య



కోవూరు: మాట్లాడుతున్న ఇందిరావతి

పొదలకూరు: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై సోమవారం మండలంలోని ఆర్‌వైపాళెం, మొగళ్లూరు పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను వెల్లడించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా లబ్ధిదారులకు అందజేశారు. ఎల్ఈడీ డిస్‌ప్లేను ఏర్పాటు చేసి పథకాలను వివరించారు. మండలంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎంపీడీఓ నగేష్‌కుమారి వెల్లడించారు. బీజేపీ మండలాధ్యక్షుడు అయోధ్యరామయ్య, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులు తెలుసుకోవాలి

కోవూరు: వ్యవసాయ శాఖలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి సూచించారు. మండలంలోని వేగూరు, లేగుంటపాడు గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్ ద్వారా అన్నదాతలను ఆదుకుంటున్నట్లు చెప్పారు. భూసార పరీక్షలకు సంబంధించి కార్డులు కూడా అందజేయడం జరిగిందన్నారు. ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖలో ప్రభుత్వం అనేక వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. కాన్పు చేయించుకున్న మహిళలకు జనని సురక్ష యోజన కింద ప్రోత్సాహకంగా నగదు, పౌష్టికాహారం అందజేస్తారన్నారు. ఎంపీడీఓ హరి, బీజేపీ మండలాధ్యక్షుడు రఘురామయ్య తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రహీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, బీజేపీ నేత రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేబాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జడ్జి శ్రీవాణి, చిత్రంలో అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రేబాల గ్రామంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి మాట్లాడుతూ 1987 న్యాయ సేవాధికార సంస్థల చట్టం ప్రకారం పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సమాజంలో పౌరులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేంద్ర, ఎంపీడీఓ నరసింహారావు, పంచాయతీ సెక్రటరీ శ్యామ్‌సుందర్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేల నగదు అందజేత

కోవూరు: మండలంలోని నేతాజీనగర్లో నిర్మాణంలో ఉన్న మసీదు, మదరసా కోసం కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి సోమవారం ఆర్థిక సాయం చేశారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో నగదును మతపెద్దలు ఇమ్రాన్ సూఫీ, జుబేర్‌బాషాకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మసీదు, మదరసా శంకుస్థాపన కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే సమక్షంలో రూ.25 వేలు ఇస్తానని హామీ ఇచ్చానని, ఆ మేరకు నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న రాధాకృష్ణారెడ్డి

రైతుల నుంచి వినతుల స్వీకరణ

పొదలకూరు: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం తహసీల్దార్ కె.వీరవసంతరావుకు ఆయన కార్యాలయంలో రైతులు వినతిపత్రాలను అందజేశారు. ప్రధానంగా భూ వివాదాలు, హద్దుల ఏర్పాటు, పట్టాదారు పాస్‌పుస్తకాలు తదితర సమస్యలపై అర్జీలిచ్చారు. పరిశీలించిన తహసీల్దార్ వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

నేత్రదానం



కరుణాకర్

విడవలూరు: విడవలూరులోని జాన్‌పేట గ్రామంలో నావూరి కరుణాకర్ (62) సోమవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను మన సేవా సంస్థ సహకారంతో డాక్టర్లు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, టెక్నీషియన్స్ నాగేశ్వరావు, వేణు పాల్గొన్నారు.

పశుదాణా పంపిణీ



ముత్తుకూరు: తుఫాన్ సహాయక చర్యల్లో భాగంగా మండలంలోని పైనాపురం, ఎంపీపాళెం పాడిరైతులకు సోమవారం పశుదాణాను పంపిణీ చేశారు. స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మునునూరువారిపాళెం సర్పంచ్ మునుకూరు జనార్దనరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే సంపూర్ణ దాణామృతాన్ని వినియోగించుకోవాలన్నారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ పంచాయతీలకు 2,000 కిలోల దాణా విడుదలైందన్నారు. ఒక రైతుకు 20 కిలోలున్న బ్యాగ్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



విడవలూరు: స్థానిక అంకమ్మ దేవాలయం వద్ద సోమవారం ఈవీఎంలో ఓటు ఎలా వేయాలి అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు డిప్యూటీ తహసీల్దార్ భానుప్రకాశ్ తెలిపారు. కొడవలూరు ఎంఈఓ అంకయ్య ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీలు, ఉదయ్, హరి ప్రసాద్, నాయకులు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కొడవలూరు: ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని కొత్త వంగల్లు, పాత వంగల్లు, గండవరం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డి.సురమౌళి భగవద్గీత ప్రతులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ వేదిక సభ్యులు శేఖర్, శ్రీదేవి, సునీల్, సుభాష్, పద్మజ, డీవీ ప్రసాద్, రాజేంద్రప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ర్యాలీ

నెల్లూరు రూరల్ : నగరంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని పలువురు నేతలు ఈ సందర్భంగా కోరారు. తొలుత గాంధీబొమ్మ సెంటర్ వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.

పక్కాగా భోజన పథకం అమలు

మనుబోలు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నట్లు ఎంఈఓ శేషాద్రి వాసు తెలిపారు. మండలంలోని బద్దెవోలు పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతో నాణ్యతతో కూడిన భోజనాన్ని అందజేస్తోందన్నారు. పిల్లలు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం నూర్జహాన్ ఉన్నారు.



భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

ఆరోగ్యశ్రీతో పేదలకు ఎంతో మేలు



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న నాయకులు

కోవూరు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం బలోపేతానికి సంబంధించి సోమవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిని కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరం నుంచి నాయకులు వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకోవడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇప్పటికే నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. వైద్యారోగ్య శాఖలో కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశించిన మేర వైద్య పరీక్షలు జరిగేవి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు పక్కాగా అందుతున్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కంటే మిన్నగా వివిధ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వాన్ని ప్రజలు తప్పక రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ అధ్యక్షురాలు టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జుబేర్‌బాషా, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఎం.చిరంజీవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అంజనారావు, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు



ప్రత్యేకాలంకరణలో వెంకటేశ్వర స్వామి



ప్రత్యేకాలంకరణలో సంగమేశ్వరుడు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఉభయకర్తల గోత్రనామాలతో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. రోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు వెల్లడించారు.

సంగమేశ్వరాలయంలో..

మనుబోలు: మండలంలోని కండలేరు ఒడ్డున వెలసిన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో మాస సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు సర్వేపల్లి ఫణీంద్రశర్మ స్వామికి క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. కామాక్షిదేవికి కుంకుమార్చన నిర్వహించారు.

మైనారిటీల హక్కులను కాపాడుకోవాలి

నెల్లూరు (వేదాయపాళెం) : మైనారిటీల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని భవన నిర్మాణ కార్మిక రంగం ఆఫీసులో మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడారు. మైనారిటీలకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ మాట్లాడుతూ హక్కుల కోసం రాబోయే రోజుల్లో ప్రతిఒక్కరూ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మైనారిటీల స్కాలర్‌షిప్‌ను తిరిగి ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. మైనారిటీ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జియావుల్ హక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని రద్దు చేస్తామని రాజ్యసభలో ప్రైవేటు బిల్లు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో హక్కులపై మాట్లాడకుంటే దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు నరేంద్ర, లాయర్ షేక్ అమీదా, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ జానీ బాషా, షేక్ మునీర్, షేక్ నజీర్, షేక్ ఫయాజ్, సయ్యద్ రవూఫ్, మహమ్మద్ సర్దార్ ఇతర ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్

బాధితులకు సత్వర న్యాయం

నెల్లూరు(క్రైమ్) : నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఏఎస్పీ డి.హిమవతి పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 90 మంది పాల్గొని తమ సమస్యలను వినతుల రూపంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్‌లకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఏఎస్పీలు చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులకు సూచించారు. ప్రధానంగా అత్తింటి వేధింపులు, వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్‌నర్స్, పోస్టల్ శాఖలో ఉద్యోగాల పేరిట మోసాలు, మిస్సింగ్ కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం, తల్లిదండ్రులపై పిల్లల వేధింపులు తదితర ఫిర్యాదులు అందాయి. అనంతరం స్పందనకు వచ్చిన వారికి భోజనం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్-2, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాసరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఏఎస్పీ